కూడళ్లు... తీస్తున్నాయ్ ప్రాణాలు

- ప్రమాదాలకు నిలయంగా మారిన జాతీయ రహదారి
- కూడళ్ల వద్ద తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



నేతాజీవంతెన కూడలి వద్ద రోడ్డు దాటుతున్న పాదచారులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ప్రధానంగా కూడళ్ల వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, సిగ్నల్ లైట్లు సరిగ్గా పనిచేయక పోవడం, డ్రైవర్ల నిర్లక్ష్యం తదితర కారణాలతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాచోదకులు నిబంధనలను బేఖాతరు చేస్తూ రాకపోకలు సాగించడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు దాటాలంటే హడలే

కృష్ణలంకలోని సత్యంగారి హోటల్ సెంటర్ కూడలి, రాణిగారితోటలో నేతాజీ వంతెన కూడలిలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు రోడ్డు దాటాలంటే బెంబేలెత్తిపోతున్నారు. సత్యంగారి హోటల్ సెంటర్ వద్ద ఉన్న కూడలి నుంచి అధికంగా నగరంలోకి రాకపోకలు సాగుతుంటాయి. తొందరగా వెళ్లాలనే ఉద్దేశంతో వాహనదారులు అడ్డదిడ్డంగా వన్‌వేలో ప్రయాణిస్తుంటారు. ఆ సమయంలో బస్టాండ్, వారధి వైపు నుంచి మితిమీరిన వేగంతో వచ్చే వాహనాల బారిన పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పలువురు మత్యువాతపడ్డారు. అమెరికన్ ఆస్పత్రి, స్క్యూ బ్రిడ్జి, గీతానగర్, నేతాజీ వంతెన కూడళ్ల వద్ద రోడ్డు దాటడం కష్టతరంగా మారింది. పోలీస్‌కాలనీ, కోటినగర్, భూపేష్‌గుప్తా నగర్, బాలాజీనగర్, రాణిగారితోట, తారకరామనగర్ ప్రాంతాల ప్రజలు రాకపోకలకు గీతానగర్ కరకట్ట కూడలి తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. ప్రమాదభరిత ప్రాంతాల్లో నేతాజీవంతెన, గీతానగర్, స్క్యూబ్రిడ్జి, సత్యంగారి హోటల్ ఉన్నప్పటికీ ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు గానీ, ప్రమాదాల నివారణకు సరైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో కూడళ్లలో యూటర్న్ తీసుకుంటున్న వాహనదారులు, రోడ్డు దాటుతున్న పాదచారులను వేగంగా వెళ్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారు. కూడళ్ల వద్ద భద్రతా చర్యలు లోపించడం, సిగ్నల్స్ పనిచేయకపోవడం, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ తక్కువగా ఉండడం వలనే ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రెండు హైవేల కలయిక



గీతానగర్ కట్ట కూడలి వద్ద రోడ్డు దాటుతున్న వాహనాదారులు

చెన్నయ్ - కోల్‌కతా, విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారులు కృష్ణలంక మీదుగా వెళ్తున్నాయి. ఈ రెండు రహదారులు కృష్ణలంక వద్దే కలుస్తున్న నేపథ్యంలో నిత్యం రద్దీ నెలకొంటోంది. బస్‌స్టేషన్ నుంచి స్క్యూ బ్రిడ్జి వరకు 2.5 కిలోమీటర్లు మేర కృష్ణలంక మీదుగా జాతీయ రహదారి ఉంది. ఈ రహదారిలో ప్రధాన కూడళ్లయిన సత్యంగారి హోటల్, నేతాజీ వంతెన, గీతానగర్ కరకట్ట, అమెరికన్ ఆస్పత్రి, స్క్యూ బ్రిడ్జి సెంటర్లు ప్రమాదభరితంగా మారాయి. ఈ రహదారిని ఆనుకుని కృష్ణలంక, రాణిగారితోట ప్రాంతాలకు చెందిన ఆరు డివిజన్లు ఉన్నాయి. ఇక్కడ నివసించే ప్రజలు నగరంలోకి రాకపోకలు సాగించాలంటే జాతీయ రహదారి దాటడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. దీంతో జాతీయ రహదారిపై ఉన్న కూడళ్ల నుంచి ప్రమాదకరంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.





సత్యంగారి హోటల్ కూడలిలో వాహనాలు ఇలా



స్క్యూ బ్రిడ్జి వద్ద ప్రమాదకరమైన కూడలి

క్లుప్తంగా

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ విభాగం ఆధ్వర్యంలో గురువారం చిన్నారులపై లైంగిక దాడుల నివారణ, పోక్సో చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ జి.మాధవి నాయుడు పర్యవేక్షణలో ప్రభుత్వాస్పత్రి పుష్కర హాలులో ఈ సదస్సు జరిగింది. ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖాధికారులు, జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం సిబ్బంది, డైస్ సిబ్బంది, మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారులు, బాలల సంరక్షణ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలలపై లైంగిక దాడులు నివారణ అమల్లో ఉన్న పోక్సో చట్టంపై అవగాహన కలిగించారు. ఈ చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సూచించారు.

మెయిన్ డ్రెయిన్‌లో పూడికతీత

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సర్వీస్‌రోడ్డు వెంట ఉన్న ప్రధాన మురుగునీటి కాలువలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోయింది. దీంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగం సిబ్బంది పూడికతీత పనులు చేపట్టారు. కార్మికులు కాలువలోకి దిగి పూడిక తొలగించి ట్రాక్టర్ల ద్వారా నగర శివారు ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరో వైపు జేసీబీతోనూ వ్యర్థాల తొలగింపు పనులు జరుగుతున్నాయి.

మొల్ల సాహిత్య ఔన్నత్యం స్ఫూర్తిదాయకం



లబ్బీపేట(విజయవాడతూర్పు): తేట తెలుగు పద్య కావ్యం మొల్ల రామాయణమని, ఆమె సాహిత్య ఔన్నత్యం స్ఫూర్తిదాయకమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొల్ల రచించిన రామాయణం, ఆమె జీవిత చరిత్ర వంటి అంశాలను డాక్టర్ సుహాసిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ జె.ఉషారాణి, డీఐఓ డాక్టర్ వై.శరత్ బాబు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుమతి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ నవీన్, డాక్టర్ సమీర, డాక్టర్ శ్రావణి, స్టాటిస్టికల్ ఆఫీసర్ లక్ష్మోజి, లిడియా, డెప్యూటీ డెమో ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

పటమట పోలీసుల దాతృత్వం



పటమట(విజయవాడతూర్పు): పటమట పోలీస్ స్టేషన్‌లో రక్షక్ డ్రైవర్‌గా పనిచేస్తున్న హోంగార్డ్ రవికుమార్ ఈ నెల పదో తేదీన రాత్రి విధులు నిర్వహిస్తుండగా స్పృహతప్పి పడిపోయారు. తోటి సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించారు. అతనికి బ్రెయిన్‌లో రక్తం కట్టడం వల్ల బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందని డాక్టర్లు నిర్ధారించారు. అతని వైద్య సేవల కోసం సీఐ, కానిస్టేబుళ్లు, హోంగార్డులు రూ.82 వేలు సమకూర్చారు. ఈ నగదును పటమట సీఐ పవన్ కిషోర్ ఆధ్వర్యంలో గురువారం డ్రైవర్ రవికుమార్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. తోటి సిబ్బంది ఆపదలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ మాతవతా దృక్పథంతో ఆలోచించి సహాయం చేయాలన్నారు. తన వద్ద నిర్వహిస్తున్న సిబ్బందికి ఆపద వస్తే అండగా ఉంటామన్నారు.

డాక్టర్ తారకప్రసాద్‌కు ఐఎస్ఏ సత్కారం



డాక్టర్ తారకప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఎనస్థీషియన్స్ అసోసియేషన్ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూడు దశాబ్దాల పాటు ఈఎస్ఐలో ఎనస్థీషియన్‌గా సేవలు అందించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్‌ను ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్థీషియాలజిస్ట్(ఐఎస్ఏ) నగర శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఎనస్థీషియన్లు పాల్గొని డాక్టర్ తారకప్రసాద్ సేవలను కొనియాడారు. రోగులకు సేవలు అందించడంతో పాటు, అసోసియేషన్‌లో కూడా పలు కీలక పదవులు అలంకరించి వన్నె తెచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఏ నగర శాఖ కార్యదర్శి డాక్టర్ రావెల దివ్య, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కీర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు డాక్టర్ శ్రీదేవితో పాటు, అసోసియేషన్ పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ భీమేశ్వర్, డాక్టర్ గేరా కిరణ్‌కుమార్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయరూ..



ప్రధాన రహదారికి ఏర్పడిన చీలిక

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక 16వ డివిజన్ భూపేస్‌గుప్తాకాలనీలోని అంతర్గత రోడ్డుతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మధ్యలో ఏర్పడిన చీలిక కారణంగా రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ కాలనీలో సుమారు 400 కుటుంబాల వారు జీవిస్తున్నారు. కాలనీకి ప్రధాన రహదారిలో ఏర్పడిన చీలిక కారణంగా తరుచూ ద్విచక్రవాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుపై రాకపోకలకు కష్టంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సుందరీకరణకు చర్యలు తీసుకోవాలి



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని మరింత సుందరంగా మార్చేందుకు వీఎంసీ తీసుకుంటున్న చర్యలను ముమ్మరం చేయాలని సంబంధిత అధికారులను మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న బందరు కాలువ గట్టుపై జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర అందాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టాలని, అందుకు అనువైన ప్రాంతాలను పరిశీలించి తనకు వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రాంతాలు సుందరీకరించటమే కాకుండా, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ, కాలుష్యాన్ని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో డెప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ రామ్మోహన్, సూపరింటెండింగ్ ఇంజినీర్ (వర్క్స్) పి.సత్యకుమారి, పార్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మార్కెట్‌ను వదిలి వెళ్లే ప్రసక్తే లేదు

- మా వ్యాపారాలు సజావుగా సాగేలా చూడండి
- రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యాపారుల వినతి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజీవ్ గాంధీ హోల్‌సేల్ మార్కెట్ తమకు అనుకూలమైన ప్రాంతమని, దీనిని వదిలి వెళ్లే ప్రసక్తే లేదని మార్కెట్ వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు బత్తుల దుర్గారావు స్పష్టం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా వేల మందికి ఉపాధి కల్పిస్తున్న రాజీవ్ గాంధీ హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద రైల్వే అధికారులు గడ్డర్లు ఏర్పాటుచేసి వ్యాపారులు, కార్మికులు, రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ వ్యాపారాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు. మహాత్మా గాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో బత్తుల దుర్గారావు మాట్లాడారు. అయ్యదేవర కాశేశ్వరరావు మార్కెట్లో హోల్ సేల్ వ్యాపారులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు 40 ఏళ్ల కిందట రాజీవ్ గాంధీ పార్కు సమీపంలో తమకు షాపులు నిర్మించి వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. నాటి నుంచి హోల్ సేల్ వ్యాపారం ఆ ప్రాంతం నుంచి కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. రెండేళ్ల నుంచి రైల్వే అధికారులు మార్కెట్‌కు అడ్డంగా గడ్డర్లు ఏర్పాటు చేసి కూరగాయల వాహనాలను లోపలికి రానీయకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. దీంతో వ్యాపారులు, రైతులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మార్కెట్లో సుమారు 67 షాపులు ఉన్నాయని, 1500 మంది కార్మికులు పని చేస్తున్నారని, మొత్తం మీద మూడు వేల మంది ఈ మార్కెట్ ఆధారంగా జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. రైల్వే అధికారులు గడ్డర్లు ఏర్పాటు చేయడం కారణంగా రోడ్డు పక్కన వాహనాలు నిలిపి అక్కడి నుంచి కార్మికులు కూరగాయలను మార్కెట్లోకి లోపలికి మోసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు అల్లు మురళీ, వెన్నం రత్నారావు, ఆకిరి శ్రీను, షేక్ ఖయ్యూం, సుంకర శివాజీ, పైడి వెంకటేశ్వరరావు, బూర్ల రమేష్, శేషు, భూషణం, గుండపు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఏర్పాట్లు



బోరును పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

పటమట(విజయవాడ తూర్పు): ఈ వేసవిలో నీటి ఎద్దడి లేకుండా నగరంలోని అన్ని ప్రాంతాల్లో బోర్లను పునరుద్ధరించాలని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం కార్పొరేటర్ ఉద్దంటి సునీతతో కలిసి ఒకటో డివిజన్ ప్రాంతంలో మధురానగర్ పప్పుల మిల్ సెంటర్, రైల్వే ట్రాక్ ఏరియా, గుణదల నుంచి రామవరప్పాడు వెళ్లే సర్వీస్ రోడ్, కార్మెల్ నగర్, వీఎంసీ ఎంప్లాయీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు పారిశుద్ధ్య నిర్వహణలోపం, దోమల సమస్యపై ఫిర్యాదు చేశారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వీఎంసీ ఎంప్లాయీస్ కాలనీ అభివృద్ధి చేయాలని రోడ్లను, స్ట్రీట్ లైట్లను, తదితర మౌలిక వసతులు అన్ని కల్పించి ఆరు నెలల్లో ఆ కాలనీని అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, వాటి యజమానులకు నోటీసులు జారీ చేసి స్థలాలను పరిశుభ్రంగా ఉంచాలని, దీనిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి.వి.జి.ఎస్.వి.ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు పి. సత్యనారాయణ, పి.సత్యకుమారి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) లత, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూ సీడీ) పి.వెంకటనారాయణ, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డెప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక, 22వ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర తూర్పు కార్యదర్శి బి.చిన్నారావు డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం డివిజన్‌లోని అన్నమ్మతల్లి గుడిరోడ్డు, సతీష్‌కుమార్ రోడ్డు, నిమ్మకాయల లక్ష్మణరావు వీధిలో పర్యటించారు. ప్రజలను అడిగి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ.. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, పరిష్కారం కాని పక్షంలో ప్రజలందరినీ కలుపుకొని నిరసన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు, టి.కృష్ణ, సాంబయ్య, కొండ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు

విజయవాడలీగల్: బైక్ చోరీ కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడు నెలల 21 రోజుల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. 2024 జూన్ 20వ తేదీ రాత్రి మొగల్రాజపురంలోని ఓ ఇంటి ముందు పార్కు చేసిన బైక్ చోరీకి గురైంది. బాధితుడు మాచవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానంతో బుడమేరు మధ్యకట్ట ఏరియాకు చెందిన కందుల విగ్నేశ్వరరావు అలియాస్ విగ్నేష్‌ను పీటీ వారెంటుపై అదుపులోకి తీసుకొని విచారించి, కోర్టులో హాజరుపరచారు. అతనిపై నేరం రుజువు కావడంతో ఏడు నెలల 21 రోజుల జైలుశిక్ష విధిస్తూ ఒకటో అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం.ఎస్.కరీముల్లా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.ఉమావతి వాదనలు వినిపించారు

బిట్ కాయిన్ పేరుతో మోసం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే మంచి లాభాలు వస్తాయంటూ నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన బళ్లా శ్రీనివాస ప్రసాద్ గతంలో వ్యక్తిగత పనిమీద వైజాగ్ వెళ్లాడు. అక్కడ కాంబుత్తుల కృష్ణ సతీష్‌తో పరిచయమైంది. బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే లాభాలు వస్తాయని కృష్ణ సతీష్ నమ్మబలికాడు. దీంతో శ్రీనివాసప్రసాద్ రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టాడు. ఆ డబ్బుతో బిట్ కాయిన్ ట్రేడింగ్ చేస్తే బాగా లాభాలు వచ్చాయని కృష్ణ సతీష్ చెప్పాడు. అయితే డబ్బులు ఇవ్వకుండా శ్రీనివాస ప్రసాద్‌ను మోసం చేశాడు. తన డబ్బులు ఇప్పించాలని కాకినాడకు చెందిన పులి ప్రతాప్‌ను శ్రీనివాస ప్రసాద్ ఆశ్రయించగా అతను చంద్రశేఖర్ అనే వ్యక్తి వద్దకు తీసుకెళ్లాడు. మూడు నెలల పాటు శ్రీనివాస ప్రసాద్‌ను అతను తన వద్దే ఉంచుకుని డబ్బులు ఇప్పించకుండా తిరిగి పంపించేశారు. దీంతో తాను మోసపోయానని తెలుసుకుని భవానీపురం పోలీసుల స్టేషన్‌లో శ్రీనివాసప్రసాద్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్లకోమాను అశ్రద్ధ చేయొద్దు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నీటి కాసులు (గ్లకోమా)ను నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంధత్వం ఏర్పడే ప్రమాదం ఉందని జీజీహెచ్ నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ పి.ప్రభాకరశాస్త్రి హెచ్చరించారు. ప్రపంచ గ్లోకోమా వారోత్సవాలను పురస్కరించుకుని జీజీహెచ్‌లో గురువారం అవగాహన సదస్సు జరిగింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకరశాస్త్రి మాట్లాడుతూ.. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ గ్లకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి లక్షణాలపై అవగాహన పెంపొందించడం ద్వారా తొలిదశలో గుర్తించి చికిత్స పొందితే శాశ్వత అంధత్వం రాకుండా నివారించొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఇ.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శిరీష పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA S.O.P.NO.7/2025

Between
I.Shaik Ashika Parveen
2.Shaik Firdos
Rep by her GPA Holder
1 st Petitioner ... ... *Petitioners*

And.

1. Reliance General Insurance Co Ltd., rep by its Servicing Manager, Surya Towers, D.No.40-1-21/8, 3rd Floor, M.G Road, Labbipet, Vijayawada-520010
2. Yes Bank Ltd., Rep by its Branch Manager, D.No.58/7/32, Ground Floor, Satya Akarsha Complex, Main Road, Lakshmipuram, Guntur, Guntur District-522007 ... .. *Respondents*

The Petitioners filed a petition before Hon'ble Court for seeking Succession Certificate to withdraw the Insurance amouktn of deceased Shaik Muneer Basha. The said matter was posted to 21.03.2025.

Therefore it is to inform to you to appear in person or through Advocate on 21.03.2025 by 10.30 A.M. before the Hon'ble Court. Else the matter will be decided in your absence.

/ / By Court order / /

S. VENKATESWARA RAO
V. SIVA PRASAD ADVOCATES FOR PETITIONER VIJAYANAGAR COLONY, GUNADALA, VIJAYAWADA-520008 CELL NO.9949894490, 9849833249
Vijayawada, Dt. 13.03.2025

● పరీక్షలకు టాటా.. ఇక ఇంటి బాట



ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారం ముగిశాయి. ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. కార్పొరేట్ కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు హాస్టళ్లను ఖాళీచేసి ఇంటి బాట పట్టారు. తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు తరలివచ్చారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో బస్టాండ్, రైల్వే స్టేషన్లు కిక్కిరిశాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





